ఉష్ణోగ్రత (అంచనా)

2-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	28


ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, కొల్లు రవీంద్ర, పయ్యావుల కేశవ్


వెలగపూడి సభా ప్రాంగణం వద్ద పసుపు జెండాలతో స్వాగతం


టీడీపీ జెండాలతో అలంకరించిన ప్రకాశం బ్యారేజి


సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



నవశకానికి.. నేడే నాంది

ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని అమరావతి పునర్వికాసం దిశగా పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణతో రాష్ట్ర చరిత్రలో నవశకానికి శుక్రవారం బీజం పడనుంది. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు సకల ఏర్పాట్లు జరిగాయి. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో శంకుస్థాపన, బహిరంగసభకు భారీగా ఏర్పాట్లు జరగ్గా.. రాజధాని జిల్లా గుంటూరుతో పాటు సమీప బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటం, ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు. పోదం పద మోదీ సభకి.. జై కొడదాం అమరావతికి అంటూ జనం సిద్ధమవగా.. వారి రవాణా, భోజనం, తాగునీటి తదితర వసతులకు అధికార యంత్రాంగం ఎక్కడిక క్కడ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. ఇక రాజధాని గ్రామాల్లో అమరావతి నిర్మాణ శంకుస్థాపనను ఓ మహోత్సవంలా రాజధాని రైతులు, మహిళలు భావిస్తున్నారు.


ప్రధాని మోదీ ఆవిష్కరించే పైలాన్

ప్రధాని పర్యటన సాగేదిలా...

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కేరళ నుంచి మధ్యాహ్నం 2.45కి గన్నవరం విమానాశ్ర యానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి ఎంఐ-17 హెలికాప్టర్‌లో బయల్దేరతారు. మధ్యాహ్నం 3.10కి వెలగపూడి సచివా లయానికి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారు. 3.20కి సభా ప్రాంగణానికి చేరుకుని 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 3.30 నుంచి 4.45 గంటల మధ్య శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణమై 4.50కి హెలిప్యాడ్‌కు చేరుకుని సాయంత్రం 5.15కి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

- అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి
- ఏ ఆకృతిలో 20 అడుగుల పైలాన్.. ఆవిష్కరించనున్న మోదీ
- వెలగపూడిలో సభకు భారీ ఏర్పాట్లు.. లక్షలాదిగా తరలిరానున్న ప్రజలు
- రాజధానికి కొండంత భరోసా ఇవ్వనున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నేనున్నానంటూ కొండంత భరోస కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం అమరావతి పర్యటనకు వస్తున్నారు. రాజధాని చరిత్రలో 2025 మే 2వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అంతా భావిస్తున్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ప్రధానమంత్రి హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భారీగా ఏర్పాట్లు చేసింది. వెలగపూడి రాష్ట్ర సచివాలయం పడమర వైపున భారీగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు గురువారానికే పూర్తి చేశారు. హెలిప్యాడ్ నుంచి వేదిక వరకు ప్రధానమంత్రి కాన్వాయ్ ట్రైల్ రన్(రిహార్సల్) విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని వేదికకు కుడి వైపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి, ఎడమ వైపున పారిశ్రామికవేత్తలు ఆశీనులవడానికి ప్రత్యేకంగా వేదికలను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి 20 అడుగుల పైలాన్‌ని ఆంగ్లంలో ఏ ఆకారంలో సీఆర్‌డీఏ నిర్మించింది. ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ అమరావతికి స్వాగతం పలుకుతున్నట్లుగా పైలాన్‌ని తీర్చిదిద్దింది. రూ.49,040 కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో హైకో ర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ, న్యాయమూర్తుల నివాస సముదాయాలు వంటివి ఉన్నాయి. అలానే ఎమ్మెల్యేలు, మంత్రులు అఖిల భారత సర్వీసెస్ అధికారుల గృహ సముదాయం పెండింగ్ పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంస్థలు ఏర్పాటు చేయబోయే కార్యాలయాల భవనాలకు కూడా పునాదిరాయి వేస్తారు. వీటితో పాటు రైలుమార్గాలు, హైవేలు, మిసైల్ టెస్టు రేంజ్, వైజాగ్‌లో యూనిటీ మాల్ వంటి పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. గ్యాలరీలన్నీ నిండినా ఇబ్బంది రాకుండా సభావేదికకు బయట వైపున ప్రత్యేకంగా టెంట్లు వేసి అక్కడ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు. కాగా ప్రధాని మోదీ బహిరంగ సభలో చేసే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అమరావతికి ఇప్పటికే కేంద్రం సాయం ప్రకటించి బ్యాంకింగ్ సంస్థల నుంచి నిధులు ఇప్పించింది. భవిష్యత్తులోనూ అమరావతికి

(మిగతా 8వ పేజీలో)


సుందరంగా సభా ప్రాంగణం

పడిలేచిన అమరావతి

ఐదేళ్ల వైసీపీ చీకటిపాలనలో నిత్యం పోరాటాలు, ఉద్యమాలతో అట్టుడికిన అమరావతి నేడు ఒక గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందేందుకు సిద్ధమైంది. మూడు రాజధానుల కుట్రతో కునారిల్లిన ఆంధ్రుల కలల రాజధాని అమరావతి మళ్లీ జీవం పోసుకుంటున్నది. 2014-2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు కీలకమైన పనులను ప్రారంభించింది. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణంతో పాటు ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవసరం అయిన వసతి భవనాలను చాలా వరకు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి పనులను నిలిపేసి.. మూడు రాజధానుల డ్రామా తో ఐదేళ్లు కాలక్షేపం చేసింది. ఈ క్రమంలో అమరావతికి భూములు ఇచ్చి న రైతుల చిరకాల పూజలు ఫలించి రాజధాని రూపకర్తగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు గెలవడంతోనే అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది.

మూడు ముక్కలాటలో ఎందరో బలి

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలుపెట్టిన మూడు ముక్కలాటలో వందల మంది రైతులు అశువులు బాశారు. తీవ్ర ఆవేదనకు గురైన ఆ గుండెలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వారి కుటుంబాలు ఛిద్రమైపోయాయి. రాజధాని కోసం భూమిని అప్పగించిన వారి త్యాగమే వారి పాలిట మృత్యుపాశమైంది. రాజధానిగా అమరావతి ప్రకటన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైసీపీ అధినేత జగన్ సంపూర్ణ ఆమోదం తెలిపారు. దీంతో రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా భూములు ఇచ్చేశారు. ఎన్నికల సమయంలో రాజధాని తరలింపుపై రైతుల్లో అనుమానాలు రేకెత్తగా.. జగన్మోహన్‌రెడ్డి ఇక్కడే తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని, రాజధాని ఎక్కడికీ పోదని అధికార పార్టీ నేతలు నమ్మించారు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి అదే ఏడాది డిసెంబరులో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో రైతులు హతాసులయ్యారు. అమరావతే రాజధాని కావాలంటూ గ్రామ స్థాయిలో మహిళలు, రైతులు చేపట్టిన ఉద్యమం గత ఐదేళ్లు మహోద్యమంగా సాగింది. రాజధాని పరిధిలోని 33 గ్రామాలకు చెందిన అన్నివర్గాల ప్రజలు చేపట్టిన ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అయినా వెనక్కి తగ్గని వైసీపీ ప్రభుత్వం తీరుతో అనేక మంది రైతులు అశువులు బాశారు. భూములు ఇచ్చి మనోవేదనతో దొండపాడులో 25 మంది, అనంతవరంలో 12 మంది, మల్కాపురంలో 23 మంది, తుళ్లూరులో 20 మంది, మందడంలో 19 మంది, వెలగపూడిలో 17 మంది, బేతపూడిలో ఆరుగురు, ఐనవోలులో 14 మంది, నీరుకొండలో 13 మంది, నేలపాడులో 12మంది రాయపూడి, ఎర్రబాలెంలో 10 మంది, కృష్ణాయపాలెంలో ఏడుగురు, కురగల్లు, వెంకట పాలెంలో ఐదుగురు చొప్పున, లింగాయపాలెంలో నలుగురు, నవులూరు, నిడమర్రు, నెక్కల్లు ముగ్గురు పెద్దపరిమిలో నలుగురు చొప్పున, తాళ్లాయపాలెం, అబ్బరాజుపాలెం, బోరుపాలెంలో ఇద్దరు చొప్పున రైతులు, రైతుకూలీలు, కౌలుదారులు మరణించారు. ఇవే కాకుండా ఇంకా గుర్తింపులోకి రాని మరణాలు మరో 50 వరకూ ఉంటాయని రైతులు చెబుతున్నారు. మూడు రాజధానుల ప్రకటన రాజధాని రైతులనే కాదు, ఆ ప్రాంతంలోని రైతు కూలీలను, ఇతర వృత్తులవారిని కూడా ఆవేదనకు గురిచేసింది. ఒకవైపు రైతుల ప్రాణాలు పోతున్నా రైతుల గుండె ధైర్యం జారిపోలేదు. పట్టుదలగా 1631 రోజులపాటు పోరాటాన్ని కొనసాగించి, ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఊరూరు తిరిగి ప్రచారం చేసి కోరుకున్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నారు.



విధ్వంసం నుంచి పునర్వికాసం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా గుర్తించకుండా అభివృద్ధి విఘాతానికి పాల్పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులను సమీకరించుకుని అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకురావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వ హించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.



అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదడంతో పాటు రూపు రేఖలను మార్చేసేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దేశించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు

(మిగతా 8వ పేజీలో)

మీ మార్క్ అభివృద్ధి కనపడాలి

- మేయర్ కోవెలమూడి రవీంద్రతో పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధిలో రాబోయే 10 నెలలు చాలా ముఖ్యమైన కాలం. ఈ 10 నెలల్లో మేయర్ మార్కు అభివృద్ధితో గుంటూరు నగరం సర్వాంగ సుందరంగా మారాలి అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసానిని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని) పెమ్మసాని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, పలు అభివృద్ధి పనులపై ఇరువురూ చర్చించారు. బొంగరాల బీడు, నార్ల ఆడిటోరియం, నల్లపాడు చెరువు, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధి, గుంటూరులోని రైల్వే వంతెనల నిర్మాణాలలో జీఎంసీ సంబంధిత పనులు పూర్తయ్యేలా చూడాలని ఈ సందర్భంగా మేయర్ నానికి పెమ్మసాని సూచించారు. గోరంట్ల మంచినీటి సరఫరా పనులు, మానస సరోవరం పీపీపీ పద్ధతి లో అభివృద్ధి, ఇప్పటి వరకు జరిగిన రోడ్ల నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు వంటి అనేక అంశాలపై మేయర్ మార్క్ అభివృద్ధి రాబోయే 10 నెలల్లో కనపడాలని సూచించారు. నగరాభివృద్ధిపై దృష్టి పెట్టి అద్భుత ఫలితాలు సాధించేలా మేయర్ పదవికి బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా పనులు జరగాలన్నారు. అనంతరం రవీంద్రబాబు మాట్లాడుతూ నగరాభివృద్ధి నిమిత్తం కార్పొరేషన్‌లో పెండింగ్ ఉన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా తీసుకుంటామని చెప్పారు.


మేయర్ రవీంద్రను సత్కరిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని

8

రాజధాని రైతుల కన్నీళ్లకు చెక్

- ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు రూ.20 వేల కోట్లు
- ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంసంతో భూ దాతలకే ఎక్కువ నష్టం

ప్రధాని సభకు 1,900 బస్సులు

- అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ఏర్పాటు

భద్రత కట్టుదిట్టం

మరణాల జాబితా ఆధారంగా ఓటర్ల తొలగింపు

- కొత్త నమూనాతో ఓటర్ సమాచార స్లిప్
- బీఎల్‌వోలకు ప్రామాణిక గుర్తింపు కార్డులు
- కొత్త నిర్ణయాలు తీసుకున్న ఎన్నికల సంఘం

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల ఖచ్చితత్వాన్ని మరింతగా మెరుగుపరచడం, ఓటు వేసే ప్రక్రియను సులభతరం చేసే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకొన్నది. జనన మరణాల రిజిస్ట్రార్ జనరల్ నుంచి నమోదైన మరణాలకు సంబంధించిన ధ్రువీకరణని ఎలక్ట్రానిక్ పద్ధతిలో డేటాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తీసుకునే ఏర్పాట్లు చేసింది. దీంతో మృతుల ఓటర్లకు సంబంధించి వారి కుటుంబ సభ్యుల నుంచి ఫారం-7 లో దరఖాస్తు అందనప్పటికీ బూత్ స్థాయి అధికారు (బీఎల్‌వో)లు తనిఖీ చేసి ధ్రువీకరించడానికి అవకాశం కలుగుతుంది. అలానే ఓటరు సమాచార స్లిప్(వీఐఎస్)ల డిజైన్‌ను మార్చాలని ఈసీ నిర్ణయించింది. దీని ప్రకారం క్రమ సంఖ్య, ఓటరు పార్ట్ నెంబరు పెద్దగా, ప్రముఖంగా కనిపించేలా డిజైన్ చేశారు. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సులభంగా గుర్తించేందుకు వీలుకావడంతో పాటు జాబితాలో పేర్లను త్వరగా గుర్తించేందుకు పోలింగ్ అధికా రులకు అవకాశం కలుగుతుంది. రాబోయే ఎన్నికల నుంచి దీనిని అమలులోకి తీసుకొస్తారు. ఓటర్ల ధ్రువీకరణ, ఓటర్ల నమోదు, ఇతర ఎన్నికల సంబంధిత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే సమయంలో బీఎల్‌వోలను ఓటర్లు సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈఆర్‌వోల ద్వారా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు ఇకపై ప్రామాణిక ఫొటో గుర్తింపు కార్డులను అందజేయాలని ఈసీ నిర్ణయించింది. తద్వారా ఓటర్ల నమోదు, జాబితాల తనిఖీ వంటి కార్యక్రమాల సందర్భంగా బీఎల్‌వోలను గుర్తించి, వారితో ఓటర్లు నమ్మకంగా సమాచారాన్ని పంచుకునేందుకు అవకాశం కలుగుతుంది.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

●షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల బకాయి జీతాలు పంపిణీ


ఉద్యోగికి నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఆయన 12 మంది ఉద్యోగులకు సంబంధించి బకాయి జీతాలు, ప్రావిడెంట్ ఫండ్ రూ.37.72 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూత పడిన షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో నిరుద్యోగ యువతకు, రైతు కూలీలకు ఉపయోగపడే విధంగా మరో కర్మాగారాన్ని ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సంప్రదించి, తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. 2014లో ఉద్యోగుల వీఆర్ఎస్‌కు ఆమోదం తెలపడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.200 కోట్లు నిధులను సమకూర్చడం జరిగిందని కానీ, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పంపిణీకి ఆటంకం ఏర్పడిందని గుర్తుచేశారు. రూ.11 కోట్ల జీతాల బకాయిలు ఉండగా ఫేజ్-1 ద్వారా 12 మంది ఉద్యోగులకు మే డే సందర్భంగా జీతం, ప్రావిడెండ్ ఫండ్ పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి త్వరలో అందించేందుకు కృషి చేస్తానన్నారు. లిక్విడేటర్ చంద్రకుమార్, ఉద్యోగుల సంఘం నాయకులు బసివిరెడ్డి, వట్టిప్రోలు యోబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం మృతి


రాజమణి(ఫైల్ ఫొటో)

ఫిరంగిపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట - గుంటూరు రహదారిలో బుధవారం రాత్రి నరసరావుపేట నుంచి గుంటూరుకు బైక్‌పై వస్తున్న గాడిదపాటి రాజమణి, రవికుమార్‌ను నరసరావుపేట నుంచి అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమణి లారీ కింద పడిపోగా వెనుక టైర్లు ఆమె దేహాన్ని ఛిద్రం చేశాయి. మృతురాలు రాజమణి ఏఎన్ఎంగా తాడికొండ మండలం మోతడక గ్రామంలో పని చేస్తున్నారు. రవికుమార్ స్వగ్రామం నరసరావుపేటలోని పాలెంనగర్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహానికి నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు ఫిరంగిపురం ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ గురువారం తెలిపారు.

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య


బసవయ్య(ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, మే, 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుసులూరుకు చెందిన కౌలురైతు తమటం బసవయ్య (44) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బసవయ్య నాలుగేళ్లుగా 20 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిరప, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది మిరప పంట చీడపీడల వల్ల పూర్తిగా నష్టం వచ్చింది. ఈ ఏడాది కూడా మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేయగా దిగుబడి సరిగా రాక, గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడికి చేసిన అప్పులు తీరుతాయలో లేదోనని బసవయ్య ఆందోళన చెందాడు. అప్పు ఇచ్చిన వారు తరచూ ఇళ్ల వద్దకు వస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఉదయం భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. భార్యను పొలం వద్దే వదిలి గుంటూరు వెళ్లి వస్తానని చెప్పిన బసవయ్య పుసులూరు సమీపంలోని ఓ పొలంలో విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు, కుటుంబ సభ్యులు చేరుకొని పరిశీలించగా మృతదేహం పక్కనే కూల్‌డ్రింక్, పురుగుమందు డబ్బా ఉండడాన్ని గుర్తించారు. దీంతో భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ

● వేలాదిగా హాజరై పునఃనిర్మాణంలో భాగస్వాములవుదాం

● రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీలు

తెనాలిరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకంగా నిలపాల్సిన ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాన్ని గుర్తుపట్టని విధంగా మార్చిందని రాష్ట్ర రవాణ, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులపై అక్రమ కేసులు పెట్టి, మహిళలపై లాఠీచార్జి చేయించిందని ఆయన మండిపడ్డారు. రాజధాని ఏదంటే చెప్పలేని విధంగా మూడు ముక్కలాట ఆడిందిని, గత పాలనను ఎప్పటికీ ఆంధ్రరాష్ట్ర ప్రజలు మరిచిపోరన్నారు. గురువారం తెనాలిలోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో రాజధాని అమరావతి పునఃనిర్మాణ సభకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీటీ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఇతర కూటమి నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి ముహూర్తం ఖరారైందని, శుక్రవారం సాయంత్రం దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో 175 నియోజకవర్గాల నుండి అశేష జనవాహిని రాజధాని నిర్మాణానికి తరలి రాబోతుందని చెప్పారు. తెనాలి ప్రాంతం నుండి కూడా వేలాదిగా సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి రాజధాని లేకుండా పాలన చేసిన గత ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. బీటీ నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో పరిశ్రమలన్నింటినీ తరిమేశారు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


యూనియన్ల నేతలతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలన్నింటినీ తన్ని తరిమేశారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. మేడే ఉత్సవాలలో భాగంగా పిడుగురాళ్ల షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఐదేళ్లలో అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్.. అరాచకాలు సృష్టించడమే పనిగా పెట్టుకొని పరిశ్రమలను తరిమేసి లక్షల మందికి ఉపాధి లేకుండా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక జగన్ ఇప్పుడున్న పరిస్థితి చూస్తే రాష్ట్రంలో ఎప్పుడు.. ఎక్కడ...ఎవరు చనిపోతారోనని ఎదురు చూస్తూ.. గద్దల్లా వాలిపోతున్నాడన్నారు. మూడుముక్కలాటతో రాజధానిని లేకుండా చేశారని, నేడు మోడీ, చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని పునర్నిర్మాణ శుభారంభం జరుగనున్నదన్నారు. కార్మికులలో అర్హులైన వారికి ఇళ్లస్థలాలు, ఇల్లు మంజూరు చేయిస్తానని, ఆటో నగర్ ఏర్పాటుతో పాటు పార్టీకి కష్టపడి పనిచేసిన పేద కుటుంబానికి ఏడాదికి ఒక ఆటో తానే కొనిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, టీఎన్ టీయూసీ అధ్యక్షుడు యరగాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలతో కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం


కళాకారులకు నగదు పురస్కారం, మెమెంటో ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

● పల్లెకోనలో నాటకాలను తిలకించిన ఎమ్మెల్యే ఆనందబాబు

● ముగిసిన పరుచూరి రఘుబాబు నాటకోత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 1 (ఆంధ్రజ్యోతి): కనుమరుగు అవుతున్న నాటక రంగాన్ని నాటకోత్సవాల ద్వారా మళ్లీ వెలుగులోకి తీసుకు రావడంతో పాటు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కళాకారులు ప్రదర్శిస్తున్న నాటికలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ రంగం ద్వారా సుపరిచితులైన ప్రముఖ రచయిత, సినీనటుడు పరుచూరి వెంకటేశ్వరరావు తన కుమారుడు రఘుబాబు స్మారకార్థం ఎన్నో ఏళ్లుగా నందమూరి తారక రామారావు కళా ప్రాంగణంలో నాటకోత్సవాలు నిర్వహిస్తూ నాటక రంగానికి పునరుత్తేజాన్ని అందిస్తున్నారన్నారు. పరుచూరి సోదరులు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం నాటక ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు ఎమ్మెల్యే అందజేశారు.

ముగిసిన నాటకోత్సవాలు

గురువారం రాత్రితో నాటకోత్సవాలు ముగిశాయి. తొలి ప్రదర్శన ఇచ్చిన శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటికను పిటి మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. రెండవ ప్రదర్శన అభినయ ఆర్ట్స్ వారి ఇది అతని సంతకం నాటికను శ్రీస్నిగ్ధ రచించగా ఎన్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. రెండు నాటికలు ప్రేక్షకులను కట్టిపడవేసేలా కళాకారులు ప్రదర్శించారు. అనంతరం పరుచూరి విజయలక్ష్మి జీవితకాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నటి శివపార్వతి, నాటకోత్సవాల సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు, వ్యాఖ్యత అయినాల మల్లేశ్వరరావు, వేజండ్ల బసవపున్నారావు, సతీష్, శివరాంప్రసాద్, ఎం.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రా ధాన్యపు లారీలను అడ్డుకున్న పోలీసులు

● బారులు తీరిన ధాన్యపు లోడు వాహనాలు


పొందుగుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో పండించిన ధాన్యాన్ని మిరియాలగూడ తరలిస్తుండగా తెలంగాణ సరిహద్దు ఓడవల్లి, తంగెడ వద్ద పోలీసులు వాహనాలను అడ్డుకున్నారు. ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణ కు తీసుకు రావడానికి వీల్లేదని వాడపల్లి పోలీసులు అడ్డు కోవటంతో లారీ, ట్యాక్సీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం లోడుతో ఉన్న నాలుగు లారీలు, మూడు డీఎంసీ వాహనాలను వాడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తెలంగాణలో పండించిన ధాన్యానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు.. రాయితీలు కూడా ఇస్తోంది. రాయితీలు, మద్దతు ధర కేవలం తెలంగాణ రైతులకు మాత్రమే ఉపయోగ పడాలనేది పొరుగు రాష్ట్రప్రభుత్వ లక్ష్యం. కాగా, కొంత మంది వ్యాపారులు ఈ ప్రభుత్వ పథకాలను ఉపయోగించు కోవాలన్న ఆలోచనతో ఆంధ్రాలోని ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు స్పందిస్తూ.. తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని తరలిస్తున్నామని, తమను అడ్డుకోవడం అన్యాయమని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దాచేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా దాచేపల్లి అంకాళమ్మ తల్లి కొలుపులతో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం ముగిశాయి. బండలాగుడు పోటీల్లో చివరి రోజు జూనియర్ విభాగంలో తెలం గాణలోని హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్ బాబు ఎడ్ల జత 3,158 అడు గులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలి చాయి. రెండవ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామా నికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,772 అడుగులు, మూడవ స్థానంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామా నికి చెందిన బుర్రముక్క కౌసల్యా రెడ్డి ఎడ్ల జత 2,565 అడుగులు దూరాన్ని లాగాయి. నాలుగవ స్థానంలో గుంటూరు జిల్లా రూరల్ మండలం లింగాయపాలెం గ్రా మానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 2,398, 5వ స్థానంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామా నికి చెందిన దొడ్లపూడి గణేష్ ఎడ్ల జత 2,250 అడుగులు దూరాన్ని లాగాయి. విజేతలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు రూ2.10 లక్షలు నగదు బహుమతి అందజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

● రెండు కేజీలకు పైగా వెండి వస్తువుల అపహరణ


ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్ఐ అల్లూరి రెడ్డి

పెదకూరపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలోని నాలుగు డొంకల సెంటర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో దొంగలు పడ్డారు. రెండు కేజీలకు పైగా వెండి వస్తువులను అపహరించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వర్షం పడిన తర్వాత పథకం ప్రకారం ఆలయ ఉత్తర ద్వారం తాళం పగల గొట్టి లోపలకు వెళ్లి.. గర్భగుడి తాళం పగల గొట్టి గుడిలోని సీసీ కెమెరాలను తొలగించారని చెప్పారు. ఆంజనేయ స్వామికి అలంకరించిన కేజీ 25 గ్రాముల వెండి కిరీటం, రెండు దండల వెండి తమల పాకులు, స్వామి వారి మొలతాడు, కను బొమ్మలు, బొట్టు, జంజం, సుమారు రెండు నుంచి మూడు కేజీల వెండి వస్తువులను దొంగిలించారు. ఎస్ఐ అల్లూరి రెడ్డి దేవాలయంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ పరిశీలనలో ఎక్కడా వేలి ముద్రలు పడకుండా దొంగలు కాళ్లకు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకున్నారని తెలిపారు. దేవాలయం బయట జత చెప్పులను వదిలి వేశారని, రాత్రి వర్షం పడిన తర్వాత దొంగతనం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. పథకం ప్రకారమే సుమారు రెండు లక్షల రూపాయలకు పైబడి వెండిని అపహరించారని కమిటీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బీటెక్ విద్యార్థులకూ..ఎడ్‌సెట్ అవకాశం

పెదకాకాని, మే1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఎడ్ సెట్-2025 దరఖాస్తుకు బీటెక్ విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ విద్యార్థులు మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, మెథడాలజీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 14 వరకు కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏపీ ఎడ్ సెట్ వెబ్ సైట్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు బాధ్యతలు


రిజిస్ట్రార్ పీఎంవీ రావు

గుంటూరు(విద్య) మే1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముందుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంవీ రావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిబ్బంది నియామకం, శిక్షణ, పనితీరును పర్యవేక్షిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ

నరసరావుపేట టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ శుక్రవారం ఉదయం 8 గంటలకు జరుగుతుందని మందాడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు నిర్మించిన ఎన్ఎస్‌పీ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో విగ్రహావిష్కరణ రాష్ట్ర, జిల్లా కూటమి నాయకుల చేతుల మీదగా జరుగుతుందని పేర్కొన్నారు. కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో రక్తదానం, కంటి వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

కృష్ణానదిలో మునిగి బాలుడి మృతి


బాలుడి మృతదేహం

తాడేపల్లి టౌన్, మే 1, (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ ఓ బాలుడు మృతి చెందిన ఘటన గురువారం తాడేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన మురారి (14) కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం మహానాడులోని కృష్ణాతీరంలో ఉన్న ధ్యాన కేంద్రం వద్దకు వచ్చాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులందరూ కృష్ణానదిలో స్నానానికి దిగారు. లోతులోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తూ బాలుడు మునిగి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సుడిగుండాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పటిదాకా తమతోపాటు కేరింతలు కొడుతూ ఆడుకున్న కన్నబిడ్డ తమ కళ్లముందే అనంతలోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'పునఃనిర్మాణాన్ని' విజయవంతం చేయాలి:చీఫ్‌విప్

వినుకొండటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా జరుగుతున్న రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి కూటమి పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నాయకులకు దిశనిర్దేశం చేయడం జరిగిందని పేర్కొన్నారు. సీనియర్ నాయకుల సూచనల మేరకు కేటాయించిన బస్సుల్లో జాగ్రత్తగా అమవరాతి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, తిరిగి జాగ్రత్తగా ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గురువారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. అలాగే బీఆర్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు.

శవాల కోసం ఎదురు చూస్తున్న జగన్



కనపర్తి శ్రీనివాసరావు

కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి రాజకీయం చేయాలనుకోవటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అనునిత్యం శవాల కోసం రాబంధులా ఎదురు చేస్తుంటారని విమర్శించారు. జగన్ ఎన్ని అబద్ధాలు చెప్పి, తల కిందులుగా తపస్సు చేసినా వచ్చే ఎన్నికల్లో ప్రతి పక్ష హోదా దక్కితే గొప్పే అని అన్నారు.

ఆదర్శకావ్యం శ్రీరామచరిత మానసం



ప్రవచనం చేస్తున్న చిమట రాఘవరావు

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక పై గురువారం తులసీదాసు రచించిన శ్రీరామచరిత మానసం గ్రంథంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త చిమట రాఘవరావు ప్రవచనం చేశారు.



ఎమ్మెల్సీ నాగబాబుతో హరి, యామిని

యామినికి ఎమ్మెల్సీ నాగబాబు అభినందనలు

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో చక్కటి ప్రతిభ చూపిన గుంటూరుకు చెందిన ఆళ్ల యామిని విద్యాధరి అనే విద్యార్థిని, జనసేన పార్టీ నాయకుడు, శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబు అభినందించారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి కుమార్తె అయిన యామిని విద్యాధరి 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించింది. గురువారం నాగబాబును ఆళ్ల హరి దంపతులు, కుమార్తె వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

4న తొమ్మిది ప్యాసింజర్ రైళ్ల రద్దు

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో ఇంజనీరింగ్ వర్కులు కారణంగా ఈ నెల 4వ తేదీన ఆదివారం తొమ్మిది ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67249 గుంటూరు - రేపల్లె, 67250 రేపల్లె - గుంటూరు, 67223 గుంటూరు - రేపల్లె, 67224 రేపల్లె - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67232 రేపల్లె - తెనాలి, 67233 తెనాలి - రేపల్లె, 67234 రేపల్లె - గుంటూరు, 67221 విజయవాడ - తెనాలి రైళ్లను ఆదివారం రద్దు చేస్తున్నామన్నారు. కాగా నంబరు. 17645 సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ని ఆ రోజున గంటపాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషనల్ కారణాలతో నంబరు. 07257 చర్లపల్లి - తిరుపతి, నంబరు. 07258 తిరుపతి - చర్లపల్లి రైళ్లను మే నెలాఖరు వరకు రద్దు చేస్తున్నామన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): భారతీయత స్వచ్ఛంద సేవా సంస్థ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పునర్నిర్మాణ సభ దిగ్విజయంగా జరగాలి

● దేగల ప్రభాకర్

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు శేఖర్ చేపట్టిన పాదయాత్ర విజయంగా పూర్తి అవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ కోరుకున్నారు. పాదయాత్రలో భాగంగా గోరంట్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 1,001 కొబ్బరికాయలు కొట్టారు. రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమంలో ఎలాంటి అడ్డంకులు జరగకుండా ఉండేందుకు 5 ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఐదువేల కొబ్బరికాయలు కొట్టామని ఆయన తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొనకళ్ల సత్యం, యోగీ, శ్రీనివాసరావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఆలయంలో శేఖర్‌తో దేగల ప్రభాకర్

అరుణ పతాకం రెపరెపలు

● ఘనంగా మేడే వేడుకలు

● ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించిన కార్మికులు

గుంటూరు (తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): వాడ వాడల అరుణ పతాకం రెపరెపలాడింది. కార్మికుల నినాదాలతో నగరం హోరెత్తింది. జెండా ఆవిష్కరణలతో ఎరుపు రంగు పులుముకుంది. మేడే వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు పెద్దయెత్తున చేపట్టారు. కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌ల ద్వారా హరించే ప్రయత్నం మోదీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మికులు ఎమ్మెల్యేకు కార్మికులు బహూకరించిన చొక్కా ను ధరించి ఎమ్మెల్యే కార్మికుల పట్ల తన అంకితభావా న్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవి చంద్ర యాదవ్, సింహాద్రి కనకాచారి కార్మికులకు స్వీట్లు తినిపించి, శాలువాలు కప్పి 'మేడే శుభాకాంక్షలు' తెలిపారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో మేడే పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



జెండాను ఆవిష్కరిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పాల్గొన్న సీపీఐ నాయకులు

● గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): శ్రమకు గౌరవం ఇవ్వడం మన ప్రగతికి పునాది వేయడమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మేడే సందర్భంగా గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఆయన మేడే జెండాలు ఆవిష్కరించారు.

● గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): టీఎన్‌టీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుంటుపల్లి శేషగిరిరావు టీడీపీ జిల్లా కార్యాలయంలో మేడే ఏడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

● గుంటూరు (విద్య) మే 1(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు ఫెడరేషన్ కార్యాలయంలో మేడే దినోత్సవం నిర్వహించారు. అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు నక్క. వెంకటేశ్వర్లు పాల్గొని, చెన్నుపాటి లక్ష్మయ్య విగ్రహానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ జెండాని సీనియర్ కార్యకర్త వినోద ఆవిష్కరించారు.

● గుంటూరు కార్పొరేషన్, మే1(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ పులి శ్రీనివాసులు క్యాంప్ కార్యాలయంలో మానవత స్వచ్ఛంద సంస్థ అందించిన టవల్స్‌ను కార్మికులకు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పి.రమేష్, అధ్యకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని, పరిశ్రమలలో పనిచేసే ప్రతి కార్మికుడి భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. మేడే సందర్భంగా గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రినేత్ర ఆటో యూనియన్ స్టాండ్‌ని గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, కార్మికుల దినోత్సవం సందర్భంగా జెండాని ఎగురవేశారు.

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరముఠా కార్మిక సంఘం, సీపీఐ, ఏఐటీయూసీ నగరసమితుల ఆధ్వర్యంలో శ్రామికజన ప్రదర్శన నిర్వహించారు. ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులుపాల్గొన్నారు.

● 41 వవార్డులోని పుచ్చలపల్లి సుందర్య నగర్ సీపీఎం కార్యలయంలో ఆ పార్టీ నగర కార్యదర్శి కె.నళీనికాంత్ జెండా ఆవిష్కరించారు.



కార్మికులకు స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే మాధవి



పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నసీర్



ఆటోస్టాండ్ వద్ద మేడే జెండా ఎగరేసిన మన్నవ మోహనకృష్ణ

● గుంటూరు నగరంలో ఆటో స్టాండ్‌లు, మున్సిపల్ మస్టర్ కార్యాలయాలు, ముఠా అడ్డాలు, కోల్డ్ స్టోరేజ్, భవన నిర్మాణ కార్మిక అడ్డాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ లాం ఫారం, ఇతర కార్మిక వాడలలో సీఐటీయూ పతాక ఆవిష్కరణలు జరిగాయి.

● ఎల్ఐసీ ఉద్యోగులు ఆధ్వర్యంలో అరండల్ పేటలోని కార్యాలయంలో మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎం ప్లాయీస్ అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. డివిజన్ ఉపాధ్యక్షుడు కౌసర్ జానీ పాల్గొన్నారు.

● ఏఐబీఈఏ ఆధ్వర్యంలో హిందు కళశాల వద్ద యూనియన్ బ్యాంకు ఆవరణలో సంఘ నాయకులు, బ్యాంకు ఉద్యోగులు జెండాను ఆవిష్కరించారు. యూనియన్ సలహాదారుడు కిషోర్ పాల్గొన్నారు.

● సీపీఐ(ఎం.ఎల్) రెడ్ స్టార్ ఆధ్వర్యంలో సంగడిగుంటలో సీనియర్ కామ్రేడ్ షేక్ బుడే, లాంచెస్టర్ రోడ్డు సెంటర్‌లో పార్టీ జిల్లా నాయకుడు సయ్యద్ జాన్ బాషా, లింగాయపాలెం కొల్లా వెంకయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వీరవల్లి శారద మేడే జెండాలను ఎగురవేశారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి పిల్లి చెన్నకేశవులు పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు స్థానిక అశోక్ నగర్‌లో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీపీఎం జెండాను సీనియర్ నాయకులు ఎ.నికల్సన్ ఆవిష్కరించారు.

అమరావతి సభకి పశ్చిమ నుంచి వేలాదిగా జనం

ఎమ్మెల్యే గళ్లా మాధవి

● సన్నాహక సమావేశంలో పరిశీలకులు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని అమరావతి సభకి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి వేలాది మందితో తరలి వెళ్లబోతున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవి చంద్రయాదవ్ సమావేశం నిర్వహించారు. జనసమీకరణ, సదుపాయల గురించి చర్చించారు. ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవి చంద్ర యాదవ్ మాట్లాడుతూ గుంటూరు నగరం నుంచి సుమారు 60 వేలకు మందికి పైగా ప్రజలు తరలివస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఇద్దరు చొప్పున వచ్చి మన ఆకాంక్షను బలంగా ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, ముత్తినేని రాజేశ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య పనులు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు సంబంధించి గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు కేటాయించిన పార్కింగ్, మెయిన్ డయాస్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేస్తున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం అమరావతిలో విధులు నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణంలో ప్రధాన వేదిక, వివిఐపి వేదిక, కల్చరల్ వేదికల వద్ద ప్రధాని పర్యటన ముగిసే వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టేలా కార్యదర్శులను, కార్మికులను కేటాయించామన్నారు. చెత్త సేకరణకు డస్ట్ బిన్లు, డంపర్ బిన్లు, కాంపాక్టర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే పార్కింగ్, ఇతర ప్రాంతాల్లో సుమారు 6 వందల మొబైల్ టాయ్‌లెట్స్‌ని ఏర్పాటుచేసి, వాటికి అవసరమైన నీటివసతి కల్పనకు ఇంజనీరింగ్ అధికారులను కేటాయించామని తెలిపారు. ప్రధాని పర్యటన విజయవంతంలో జీఎంసి సిబ్బంది తమకు కేటాయించిన విధులను శ్రద్ధగా నిర్వహించాలని, పనులను డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విధుల్లో ఉండే కార్మికులు, సిబ్బందికి ఆహారం, తాగునీటిని అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వాస్పత్రికి రూ.2కోట్ల విలువైన పరికరాలు

● కేంద్ర మంత్రి పెమ్మసానిచే రేపు ప్రారంభం

గుంటూరు మెడికల్, మే 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి వివిధ స్వచ్ఛంద సంస్థలు సుమారు రూ.2 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేశాయి. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఈ వైద్య పరికరాలను లాంచనంగా ప్రారంభిస్తారు. ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటుచేసిన స్టెప్‌డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభిస్తారు. అదేవిధంగా జీఎంసీ పూర్వ విద్యార్థుల వితరణతో చేపట్టే ఇంకుడుగుంతల నిర్మాణ పనులను డాక్టర్ పెమ్మసాని ప్రారంభిస్తారు. ఈ మేరకు ప్రభుత్వాస్పత్రి అధికార వర్గాలు గురువారం ఈ విషయాలను వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ కమిటీ తరఫున జీజీహెచ్‌కు రూ.1.60 కోట్ల విలువైన నాలుగు అడల్ట్ వెంటిలేటర్లు, ఆరు పీడియాట్రిక్ వెంటిలేటర్లను విరాళంగా అందజేశారు. 20 పడకలతో నూతనంగా నిర్మించిన స్టెప్‌డౌన్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వార్డుకు భాష్యం పేరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, భారత్ ఫార్మా అండ్ మెడికల్ ఆక్సిజన్స్ సంస్థలు రూ.22 లక్షల వ్యయంతో ఏసీ మెషిన్లు, ఇతర పరికరాలను అందజేశాయి. గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, జీజీహెచ్‌లో ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.9లక్షల విరాళం అందజేశారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వీటిని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యేతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తెలిపారు.

మోదీ రాకతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

● బీ జే పీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ



మాట్లాడుతున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ, పాల్గొన్న తిరుపతిరావు తదితరులు

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): మోదీ రాకతో ఏపిలో సువర్ణాధ్యాయం నేటి నుంచి ప్రారంభం కానుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లో గురువారం ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగిలిన రాష్ట్రాలు కంటే ఏపీ పట్ల మోదీ మక్కువ చూపిస్తారని, పది నెలల కాలంలో ఆయన మూడోసారి రాష్ట్రంలో పర్యటిస్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జ్ టి రామకృష్ణారెడ్డి, పి రవికుమార్, చరకా కుమార్ గౌడ్, వెలగలేటి గంగధారరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నగర మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ తదితరులు

ఎన్టీఆర్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

గుంటూరు కార్పొరేషన్, మే 1(ఆంధ్రజ్యోతి): పిల్లలను క్రీడల్లో తల్లి తండ్రులు ప్రోత్సహించాలని గుంటూరు నగరం మేయర్ కోవెలమూడి రవీంద్ర విజ్ఞప్తి చేశారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో సమ్మర్ క్యాంపును ఎమ్మెల్యే గళ్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులులతో కలిసి క్రీడలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాధవి కృషితో త్వరలో జిమ్‌ను ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపు ను ఈ ఏడాది కూడా నేటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారని, ఇందుకు... మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ క్యాంపు కు మొత్తం 427 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, దామంచర్ల శ్రీనివాస్, ఈరంటి ప్రసాద్, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



బిల్డర్స్ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్,మే1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని నేరేడ్కో బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ని నగర పాలక సంస్థలోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో బిల్డర్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పై చర్చించారు. కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని కోరారు. నెరెడ్కో ప్రెసిడెంట్ నాగవంశి, సెక్రటరీ శ్రీనాథ్, ట్రెజరర్ అర్జున్ సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాహితీ, సమాజిక రంగాల్లో సోమేపల్లి సేవలు అభినందనీయం

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని



రచయిత్రి యమున, రాఘవరావు దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): నిజాయితీ గల అధికారిగా ప్రభుత్వ సేవలు అందించటంతో పాటు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘాన్ని నిర్మించి పలువురు కవులను గుర్తించి వెలుగులోనికి తెచ్చిన గొప్ప వ్యక్తి సోమేపల్లి వెంకటసుబ్బయ్య అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో గురువారం సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రధాన సభ జరిగింది. రాష్ట్ర రచయితల సంఘం ప్రధానకార్యదర్శి చలపాక ప్రకాష్ సభకు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ గ్రామీణ రైతాంగ ఈతి బాధలను తన రచనల ద్వారా వ్యక్తీకరించారన్నారు. విశిష్ట అతిథి, మరొక కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో అక్కడి పేదలు తమ కాలనీకి వెంకటసుబ్బయ్య కాలనీగా పేరుపెట్టుకున్నారని కొనియాడారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, గుళ్ళపల్లి సుబ్బారావు, కందిమళ్ల శివప్రసాద్, నానా సోమేపల్లి వ్యక్తిత్వం, కవి హృదయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెక్కలు వచ్చాయి కథా పురస్కారం రచయిత్రి సి.యమున, రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో సుభాని, శ్రీవశిష్ట, టి.పద్మావతి, వి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు



సిద్ధమైన సభా వేదిక

భద్రత కట్టుదిట్టం

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజధాని ప్రాంతమంతా గడిచిన రెండు రోజులుగా పోలీస్ వలయంలో ఉంది. 6 వేల మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం చివరి క్షణంలో మరో 300 మంది అదనపు బలగాలని రప్పించారు. ప్రధాని పర్యటించే ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాని పాల్గొని బహిరంగ సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండడానికి కొన్ని వాహనాలకు సంబంధించి పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఆయా నిబంధనలు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమలులో ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు.

వేదిక చుట్టూ ఎస్పీజీ, గ్రేహౌండ్స్

ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభ వేదిక చుట్టూ ఎస్పీజీ బలగాలతో పాటు గ్రేహౌండ్స్ పూర్తి అప్రమత్తంగా పహారా కాయనున్నాయి. వీరి తర్వాత వేదిక చుట్టూ షూటర్స్ డేగకళ్లతో పరిస్థితులను నిశితంగా గమనిస్తూ ఉంటారు. ఆ తర్వాత ఆర్మ్‌డు రిజర్వు, ఏపీఎస్పీ బలగాలు విధుల్లో ఉంటాయి. ప్రతి గ్యాలరీ వద్ద సాయుధ బలగాలు నిఘా వేయనున్నాయి.

సభకు వచ్చే మార్గాల వివరాలు

కార్యక్రమానికి వీవీఐపీలకు ప్రత్యేక రూట్ మ్యాప్ ఇచ్చారు. ప్రకాశం బ్యారేజీ, స్నూృ బ్రిడ్జి, ఉండవల్లి గుహలు దాటిన తర్వాత కుడివైపు తీసుకుని సబ్ స్టేషన్ రోడ్డులో నుంచి కరకట్ట రోడ్డు మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి వెళ్లి అక్కడి నుంచి వీఐపీ పార్కింగ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది.

- కాజా టోల్గేట్ సర్వీస్ రోడ్డు నుంచి మురుగన్ హోటల్ వద్ద ఎడమవైపు తీసుకుని వెస్ట్ బైపాస్ మీదగా పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ మార్గంలో గుంటూరు నుంచి 1800, పల్నాడు నుంచి 500 బాపట్ల నుంచి 350 ప్రకాశం నుంచి 190 వాహనాలు రానున్నాయి.
- గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ఈ సెవెన్ జంక్షన్ మీదగా కేటాయించిన పార్కింగ్‌లోకి వెళ్లాలి. ఈ రోడ్డులో గుంటూరు నుంచి 700 వాహనాలు రానున్నాయి.
- అమరావతి వైపు నుంచి పెదమద్దూరు, వైకుంఠపురం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, రాయపూడి వై జంక్షన్ నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదగా న్యూ పార్క్ రోడ్డులో నుంచి పార్కింగ్‌లోకి వెళ్ళాలి. ఈ మార్గంలో పల్నాడు జిల్లా నుంచి 600 వాహనాలు రానున్నాయి.
- వీవీఐపీ వాహనాలకు ప్రకాశం బ్యారేజ్ - లోటస్ పాయింట్ - కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్(ఈ3) - ఎన్9 జంక్షన్ - సభా ప్రాంగణానికి చేరుకుని పీ8, పీ9 సెక్టార్లలో పార్కింగ్ చేయాలి.
- సభా ప్రాంగణం - ఈ3 రోడ్డు - కరకట్ట రోడ్డు - ప్రకాశం బ్యారేజ్ ద్వారా విజయవాడ వెళ్ళవచ్చు.
- అత్యవసర సేవలకు సంబంధించిన వాహనదారులు సభా ప్రాంగణం - ఎన్9 జంక్షన్ - కురగల్లు - నిడమర్రు - మంగళగిరి నుంచి వెళ్ళవచ్చు.







నవశకానికి.. నేడే నాంది

(5వ పేజీ తరువాయి)

వరాల జల్లు కురిపించేలా మోదీ హామీలు ఇస్తారని చాలామంది ఆశిస్తున్నారు.

మంత్రుల సమీక్షలు..

గురువారం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్లో మంత్రుల కమిటీ సమావేశం నిర్వహించింది. పర్యవేక్షణ అధికారులతో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిలతో మంత్రి నారాయణ సమావేశమై కార్యక్రమానికి వచ్చే ప్రముఖులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వివిధ జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి నారాయణ టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇక రాజధానిలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని, రాజధాని రైతులు ఇంటింటికీ తిరిగి ఆహ్వానిస్తున్నారు.

విధ్వంసం నుంచి పునర్వికాసం

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించుకున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. గృహ, భవన నిర్మాణ పనులకు సంబంధించి రూ.12,700 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఐకానిక్ బిల్డింగ్స్ కేటగిరీలో సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అఖిల భారతస్థాయి అధికారుల భవనాలు ఉన్నాయి. రాజధానిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.16,200 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ఆర్టీరియల్ రోడ్లు, సబ్ ఆర్టీరియల్ రోడ్లు, ఫ్లడ్ మిటిగేషన్ పనులు ఉన్నాయి. ఎల్పీఎస్ ఇన్ఫ్రా కింద రూ.20,100 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ నెట్‌వర్క్ వంటి అనేక పనులు వీటిలోనే ఉంటాయి.

ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల సమీకరణ

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పిలిచిన వాటికి, పిలవాల్సిన వాటికి సంబంధించి ఇంకా రూ.74 వేల కోట్ల నిధులు కావాల్సిన అవసరం ఉంది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు వస్తే మరో రూ.69 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నేషనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

వెలగపూడిలో జరిగే సభకు వచ్చే వారికి అనుకూలమైన రహదారులను అధికారులు అందంగా తీర్చిదిద్దారు. ఎంవీఐపీ, వీవీఐపీ, వీఐపీలకు కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్లను సిద్ధం చేశారు. విజయవాడ వైపు నుంచి వచ్చేవారి కోసం సీడ్ యాక్సిస్ రోడ్డు, ఎన్-9 రోడ్డును సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి వచ్చేవారి కోసం వెస్ట్ బైపాస్ నుంచి ఈ-11 రోడ్డు మీదగా నిడమర్రు, కురగల్లు నుంచి వెలగపూడికి చేరుకోవచ్చు. తాడికొండ మీదగా వచ్చేవారు ఎన్-9 రోడ్డు మీదగా సభావేదికకు చేరుకోవచ్చు. సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అక్కడే తాగునీరు, మజ్జిగ, ఆహార సదుపాయాలు కల్పించారు. జిల్లాల వారీగా బస్సులకు రూట్‌మ్యాప్‌లు ఇచ్చేశారు. ఉదయం 11 గంటలకే బస్సులు వెలగపూడి చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా కీలకమైన ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు కేటాయించారు.

ప్రధాని సభకు 1,900 బస్సులు

- అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ఏర్పాటు
- రాష్ట్ర వ్యాప్తంగా అమరావతికి తరలివస్తున్న ప్రజలు
- సాధారణ ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి విచ్చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఆర్టీసీ సమాయత్తమైంది. మొత్తం 1,900 బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఇతర డిపోల నుంచి బస్సులని సమకూర్చింది. అటు విశాఖ, శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం, కడప, కర్నూలు వంటి ప్రాంతాల డిపోల నుంచి బస్సులను అమరావతి సభకు ఏర్పాటు చేశారు. ప్రధాని సభకు వెళ్లాల్సిన బస్సులు గురువారం రాత్రికే గుంటూరు చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సభకు తరలిరానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు శుక్రవారం ఉదయానికి చేరుకునేలా ఏర్పాటు చేశారు. జన సమీకరణకు సంబంధించి ముందుగానే ఆయా ప్రాంతాల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సుల్లో ప్రజలను తీసుకొచ్చేలా ప్రణాళి కలు వేస్తున్నారు. ప్రజల్ని సభకు తీసుకురావడం.. అనంతరం గమ్యస్థానాలకు చేర్చడం వరకు మానిటరింగ్ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించారు. బస్సులు కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించిన అమరావతి పునఃప్రారంభోత్సవానికి తరలివచ్చేందుకు ప్రజలు కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతోన్న నేపథ్యంలో ప్రత్యక్షంగా సభను తిలకించేందుకు ఎంతో ఆశ పడుతున్నారు.



మోడీ సభకు తరలి వెళ్ళేందుకు పెదకూరపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న బస్సులు

సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా..

సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందుకోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కారణంగా పెద్దగా ప్రయాణికుల రద్దీ లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సర్వీసులు కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి పర్యవేక్షిస్తామని తెలిపారు.

యూపిక్స్.. ఐపీ

లబోదిబోమంటున్న బాధితులు

రూ.2.72 కోట్లు ఆస్తులు.. రూ.155.95 కోట్లు అప్పులు

నరసరావుపేటకు చెందిన ఐదుగురి పెట్టుబడి రూ.65.5 కోట్లు

నరసరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశచూపి భారీగా పెట్టుబడులు సేకరించిన యూపిక్స్ క్రియేషన్స్ యానిమే షన్ సంస్థ నిర్వాహకుడు నిడుమోలు వెంకటసత్యలక్ష్మీకిరణ్ ఇటీవల బోర్డు తిప్పేశాడు. ఈ సంస్థ బాధితుల్లో నరసరావుపేట వాసులే ఎక్కువగా ఉన్నారు. విజయవాడకు చెందిన ఇతడు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో ఐపీ పిటిషన్‌ను దాఖలు చేశాడు. 2014లో సంస్థను ఏర్పాటు చేసి రూ.155.95 కోట్లు పెట్టుబడులుగా సేకరించినట్లు 102 మంది జాబితాను కిరణ్ కోర్టుకి సమర్పించాడు. నరసరావుపేట వారితో పాటు విజయవాడ, గుంటూరు, హైదారాబాదు తదితర ప్రాంతాల వారు కూడా కిరణ్ సంస్థలో బాధితులుగా ఉన్నారు. నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి రూ.15 కోట్లు, మరో వ్యాపారి 15.50 కోట్లు, ఇంకో వ్యక్తి రూ.5 కోట్లు, మరొకరు రూ.18 కోట్లు, ఇంకొకరు రూ.12 కోట్లు, మరికొందరు రూ.కోటి నుంచి నాలుగు కోట్ల వరకు సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టారు. మూడేళ్లలో ఓ పథకం ప్రకారం దాదాపు రూ.400 కోట్లు పెట్టుబడులు సేకరించి సంస్థను మూసి వేశాడు. రూ.2.72 కోట్లు మాత్రమే ఆస్తులు, రూ.155.95 కోట్లు అప్పులు ఉన్నట్లు ఐపీ పిటిషన్ దాఖలు చేయడంతో మిగతా సొమ్మును ప్రస్తావించలేదని బాధితులు వాపోతున్నారు. ఐపీ పిటిషన్‌లో నరసరావుపేటకు చెందిన వారి కొందరి పేర్లు లేనట్లుగా బాధితులు తెలిపారు. ఇటీవల వరకు కొంతైనా సొమ్ము తిరిగి వస్తుందన్న బాధితులు ఆశలపై కిరణ్ నీళ్లు చల్లాడు. అప్పులు చేసి సదరు సంస్థలో పెట్టుబడులు పెట్టిన ఇద్దరు వ్యాపారులు వారి ఆస్తులు విక్రయించి బాకీలు తీరుస్తున్నట్లు తెలిసింది. ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.

రాజధాని రైతుల కన్నీళ్లకు చెక్

ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు రూ.20 వేల కోట్లు

ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంసంతో భూ దాతలకే ఎక్కువ నష్టం

ఈ సారి ఆ తప్పు జరగనివ్వకుండా ప్రథమ ప్రాధాన్యం రైతులకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చడానికి అమరావతి ప్రాంత రైతుల సహకారం ఎనలేనిది. ఎంతో పెద్ద మనసు తో 34 వేల ఎకరాలను పైసా ఆశించకుండా ఇచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజధాని విధ్వంసా నికి గురి కావడంతో భూములిచ్చినందుకు రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు మంచి జరగబోతోంది. రైతులకు ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కేటాయించినా వాటికి తగ్గ మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. ఈ సారి ఆ తప్పు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎల్పీఎస్ ఇన్ఫ్రా(రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయలు) కింద రూ.20 వేల కోట్లను ఖర్చు చేస్తోంది. రెండేళ్లలోనే రైతులకు ప్లాట్లు కలిగిన లే అవుట్లు అన్నీ అభివృద్ధి చెందనున్నాయి. రాజధాని అభివృద్ధి కోసం భూ సమీకరణ విధానాన్ని జనవరి 1, 2015న ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్థానిక రైతులు, ప్రజల అభిప్రాయాల ఆధారంగా భూ సమీకరణ ముసాయిదా అనంతరం సీఆర్ డీఏ అధికారులు భూ సమీకరణలో మార్పులు చేశారు. ప్రభావిత కుటుంబాలకు మరింతగా ప్రయోజనాలు, పరిహార ప్యాకేజీలను ప్రకటించింది. భూ సమీకరణ పథకంలో చేసిన సవరణలతో రాజధాని ప్రాంత రైతులు తమ భూములను రాజధాని నిర్మాణం కోసం ఇచ్చేందుకు అంగీకరించారు.

విజయవంతమైన మోడల్..

భూ సమీకరణ విధానం ప్రపంచంలోనే టాప్ మోడల్‌గా నిలిచింది. ఈ విధానాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో ఎంత విజయవంతమైందో అర్థమౌతోంది. ల్యాండ్ పూలింగ్ విధానం అనేది భూమిని తీసుకోవటం మాత్రమే కాదని, భవిష్యత్తును సమిష్టిగా నిర్మించే విధాన మని ప్రభుత్వం ప్రపంచానికి చూపించింది. రాజధానిలో 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 34,000 ఎకరాలకు పైగా భూమిని రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారు. అమరావతిని దేశం లోనే మొట్టమొదటి ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న రాజధానిగా నిలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు పారదర్శకంగా 65,000కి పైగా ఈ - లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు.

జాప్యంతో.. నష్టపోయిన రైతులు

రైతులకు ప్యాకేజీ కింద ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు కలిగిన లే అవుట్లను సకల సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సి ఉండగా.. అప్పట్లో ఈ పనుల విషయంలో కొంత జాప్యం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి వినాశనంతో అందరికంటే ఎక్కువగా రైతులు ఇబ్బందులు పడ్డారు. గత తప్పిదాలను పునరావృత్తం కానీయకుండా ఉండేందుకు ఈ సారి ప్రభుత్వం లేఅవుట్ల, ప్లాట్ల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. రెండేళ్లలో ఈ పనులు పూర్తి కానున్నాయి.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం

రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను త్వరిగతిన పూర్తి చేసేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి, రాజధాని రైతులకు అందుబాటులో ఉండేలా అమరావతిలో 11 యూనిట్ ఆఫీసులను, తొమ్మిది ప్రాంతాలలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలను సీఆర్డీఏ ప్రారంభించింది. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే వార్షిక కౌలు ప్రకటించింది. భూమిలేని పేదలకు ప్రతి నెలా రూ.5 వేల పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. రైతుల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అందిస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.



ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వవైభవం

మంత్రి బీసీ జనార్దనరెడ్డి


పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలతో ఒంగోలు జాతికి పూర్వపు వైభవం వస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సాంప్రదాయ పూజలు చేసి, పోటీలను ప్రారంభించారు. అతిథులు ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, టంగుటూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు ప్రాంగణంలోని ఎన్టీఆర్, వీరయ్యచౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిరోజు రాష్ట్ర నలుమూలల నుంచి 17 జతల ఎడ్లు టచ్ పళ్ల విభాగంలో 600 కిలోల బండను హోరాహోరీగా లాగాయి. సందర్భంగా జరిగిన సభలో మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నారని, మండు వేసవిలో వడ్లమూడిలో పందేలు నిర్వహించడం సాహసోపేతమన్నారు. ప్రతి గ్రామంలో పూర్వం దూలపు ఎడ్లను పెంచి పందేలు నిర్వహించడం ద్వారా రైతులకు గుర్తింపు వచ్చేదన్నారు. ప్రస్తుతం అలాంటి గుర్తింపు తీసుకువచ్చేలా వీరయ్యచౌదరి మెమోరియల్ కృషిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్, తన తండ్రి వీరయ్యచౌదరి పేరుతో ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకుని ప్రతి రైతు ఒంగోలు జాతిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.



బరిలో బండ లాగుతున్న ఎద్దులు



ఎద్దుల రైతులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే నరేంద్రకుమార్


స్వాగత శుభాకాంక్షలు
జై అమరావతి
జై ఆంధ్రప్రదేశ్
విశ్వాన్ని ఏలేది బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు .... విశ్వనగరం రాజధాని అమరావతి నిర్మాణం చేసేది ఈ ముగ్గురు
ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గార్లు
వీరికి చేదోడు, వాదోడుగా గుంటూరు ఎంపి, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ గార్లు
నేడు రాజధాని అమరావతి పునఃప్రారంభ పనులకు శంకుస్థాపన చేయుటకు విచ్చేయుచున్న మాన్యశ్రీ భారతదేశ ప్రధాని మంత్రి
శ్రీ నరేంద్ర మోడీ గారికి స్వాగతం - సుస్వాగతం
పువ్వాడ సుధాకరరావు
సీపీ, ఎఫ్‌సీపీ, ఎల్‌ఎల్‌బీ
అమరావతి ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్,
ఉప్పలపాటి సాంబశివరావు
తాడికొండ నియోజకవర్గ టిడిపి
సీనియర్ నాయకులు
బండ్ల పట్టాభిరామయ్య
తాడికొండ నియోజకవర్గ టిడిపి
సీనియర్ నాయకులు
జొన్నలగడ్డ కిరణ్ కుమార్
తుళ్ళూరు మండల టిడిపి
మాజీ అధ్యక్షులు
కాటా అప్పారావు
తుళ్ళూరు గ్రామ టిడిపి అధ్యక్షులు
జమ్ముల హరికిరణ్ (బాబి)
తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు
పాటిబండ్ల జయకృష్ణ
తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు
జమ్ముల అనిల్ కుమార్
తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు
కొల్లి నరేంద్ర
తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు
మూల్పూరి రాంబాబు
తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు
నెలకుదిటి చంద్రశేఖర్-(చందు)
తాడికొండ ఆర్టీయస్ కో-ఆర్డినేటర్,
బాలయ్య యువసేన అధ్యక్షులు
తుళ్ళూరు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి 1316 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.4 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లెకాల్వకు 190, తూర్పుకాల్వకు 128, పశ్చిమకాల్వకు 66, నిజాంపట్నం కాల్వకు 225, కొమ్మమూరుకాల్వకు 514 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

ఎస్ఆర్ఎంలో రేపు మహిళలకు యంత్రాల పంపిణీ

మంగళగిరి సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి తన వంతు సహకారం అందించనుంది. మహిళల స్వయం ఆర్థిక స్వావలంబనకు దోహదపడే పథకాల ద్వారా మహిళలను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. దీనిలో భాగంగా ఈ నెల 3వ తేదీన ఎంపిక చేసిన మహిళలకు వివిధ రకాల యంత్ర పరికరాలను అందించనుంది. మొత్తం రూ.72 లక్షల విలువైన యంత్రాలను మహిళల కోసం సిద్ధం చేసింది. వర్సిటీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం జరుగనున్న కార్యక్రమంలో వీటిని పంపిణీ చేయనున్నారు. యూనివర్సిటీలోని ఎంటర్‌ప్రిన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈ ఏడాది సీఎస్ఆర్ ప్రోగ్రాం ప్రారంభమైంది. తుళ్లూరు, తాడికొండ, తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ అర్బన్ మండలాలతోపాటు తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలాలకు చెందిన 1500 మంది మహిళలకు స్వయం ఆర్థిక స్వావలంబనకు సంబంధించి వివిధ పనుల్లో శిక్షణ ఇచ్చారు. ఇందులో సమగ్రంగా శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు అంకుర సంస్థలుగా ఏర్పడ్డారు. వీటిలో వంద అంకుర సంస్థలను ఎంపిక చేసి వీరికి వివిధ రకాల వస్తువుల ఉత్పత్తికి సంబంధించిన యంత్రాలను పంపిణీ చేయనున్నారు. సోలార్ డ్రయ్యర్ యూనిట్లు, రవ్వ మేకింగ్ మిషన్లు, గ్రైండర్లు, శానిటరీ ప్యాడ్స్ మేకింగ్, బాటిల్ మేకింగ్ వంటి 8 రకాల యంత్ర సామగ్రిని అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరవుతారని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివరామ్ టెకీ



నియామకపత్రం అందుకుంటున్న శివరామ్

తాడేపల్లి (ఉండవల్లి), మే 1 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లికి చెందిన శివరామ్ టెకీ గుంటూరు జిల్లా బీసీ (జేఏసీ) సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ (జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు, ఆనందయ్యల నుంచి గురువారం నియామకపత్రాన్ని అందుకున్నారు. శివరాం టెకీ నీతి నిజాయితీలతో సమాజానికి సేవలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు అంగిరేకుల ఆదిశేషు, ఆనందయ్య, పొనమాల మల్లేశ్వరరావు, సైకం సురేష్, మస్తాన్‌రావు, బాలాజీ, నితిన్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు. శివరామ్‌కు పదవి లభించడంపై ఉండవల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు.


పొలం పత్తికట్టెలో నాగాభరణం ప్రత్యక్షం



పత్తికట్టెలో దొరికిన నాగాభరణం

ప్రత్తిపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడు శివాలయంలో జరిగిన దొంగతనంలో మాయమైన నాగాభరణం పొలంలోని కాల్చిన పత్తి కట్టెలో ప్రత్యక్షమైంది. ఈ ఏడాది మార్చి 3వ తేదీన గొట్టిపాడులోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో అర్ధరాత్రి పూట దొంగలు పడి సుమారు 9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ దొంగతనానికి సంబంధించి దేవాలయంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజిలో రికార్డు అయింది. అయితే దీనిపై ఇంతవరకు పోలీసులు ఆచూకీ కనుగొనలేక పోయారు. ఈ క్రమంలో దేవాలయంలోని నాగాభరణం గొట్టిపాడు నుంచి ప్రత్తిపాడు వచ్చే రోడ్డు పక్కన గల జాలాది వారి మిల్లు సమీపంలోని పొలంలో రైతు బుధవారం తాను కుప్ప వేసిన పత్తి కట్టెను తగల బెట్టాడు. గురువారం ఉదయం తగల బెట్టిన బూడిదలో స్వామి వారి నాగాభరణం కనిపించింది. దీంతో ఆ నాగాభరణాన్ని దేవాలయానికి చేర్చినట్టు తెలిసింది.

రైతుల కల్లాల్లో మిర్చి దొంగతనం



శ్రీనివాసరావుకు చెందిన మిర్చి కల్లం

మేడికొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలను ప్రకృతి విపత్తులతో పాటు దొంగల రూపంలో తమకు దక్కకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడికొండూరు మండలం సిరిపురంలో వెలనాటి శ్రీనివాసరావు రైతు తమ పొలంలో సుమా రూ.40 క్విం టాళ్ల మిరప పంటను కోసి కల్లాల్లో ఆరబోసి ఎండబెట్టారు. బుధవారం రాత్రి ఎండు మిరప రాశిలోని సుమారు 15 క్వింటాళ్ల కాయలు దొంగలు టిక్కీల్లో నింపుకొని వెళ్లినట్లు రైతు శ్రీనివాసరావు తెలిపారు. మిర్చి దొంగతనంపై మేడి కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతు శ్రీనివాసరావు తెలిపారు.

అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలి

● ఐనవోలు రచ్చబండలో మంత్రి నాదెండ్ల మనోహర్



ఐనవోలులో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తుళ్లూరు(ఐనవోలు), మే 1 (ఆంధ్రజోతి): అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం సాయంత్రం రాజధాని గ్రామం ఐనవోలులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. 60 వేల కోట్ల రూపాయల పనులకు ప్రధాని నరేంద్ర మోదీ సభలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రచ్చబండలో మంత్రి మాట్లాడుతూ శుక్రవారం అమరావతిలో జరగబోయే సభకు విశేషంగా హాజరు కావాలని మంత్రి మనోహర్ పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి పాలన అందించాలనే సంకల్పంతో కూటమి పాలన ఉందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు దేశంలో ఎక్కడా జరగని విధంగా భారత ప్రధాని రెండో సారి, రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి రావటం గొప్ప ఘట్టంగా అభివర్ణించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన 29 గ్రామాలను అభి వృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు రైతులు అద్భుతమైన రాజధానిని అప్పజెప్పారని దానిని అభివృద్ధి చేసే బాధ్యత కూటమి తీసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపు ఆలోచనలతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు, యర్రగోపు నాగరాజు, ఎర్రబాలెం, బేతపూడి, ఐనవోలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ప్రధాని సభ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

తాడేపల్లిలో ట్రాఫిక్ నిబంధనలు

● వాహనచోదకులు సహకరించాలి : సీఐ కళ్యాణరాజు



తాడేపల్లి టౌన్, మే 1, (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు శంకుస్థాపన కోసం వస్తున్న ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు తాడేపల్లి సీఐ కళ్యాణరాజు తెలిపారు. తాడేపల్లి పరిధి డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేట ప్రాంతాల నుంచి విజయవాడ వైపు వెళ్లేవారు తాడేపల్లి ఊర్లో నుంచి ఒకటో వార్డు అంబేద్కర్ విగ్రహం వద్ద మలుపు తీసుకుని జాతీయ రహదారి వైపు వెళ్లాలని సూచించారు. ఉండవల్లి కూడలి నుంచి ప్రకాశం బ్యారేజి వైపు ఎలాంటి వాహనాలు అనుమతించబోమని సీఐ తెలిపారు. బ్యారేజి వద్ద ఉన్న లోటస్ పక్క నుంచి అమరావతి కరకట్ట మీదుగా రాజధాని వైపు వెళ్లే మార్గాన్ని వీవీ ఐపీలకు కేటాయించినట్టు తెలిపారు. అలాగే ఉండవల్లి కూడలి మీదుగా వీఐపీల వాహనాలు అధికారుల వాహనాలు వెళ్లడానికి మార్గం సిద్ధం చేసినట్టు తెలిపారు. 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాజధాని అమరావతిలో కార్యక్రమం ముగిసేవరకు ఈ ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయని ప్రయాణికులు సహకరించాలని కోరారు. కాగా ప్రధానికి స్వాగతం పలుకుతూ ప్రకా శం బ్యారేజిపై కూటమి పార్టీల జెండాలను ఏర్పాటు చేశారు. అలాగే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల ఫ్లెక్సీలు కటౌట్‌లను పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు.

కులగణనతో సామాజిక న్యాయం గెలిచింది

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్



ప్రధాని మోదీ, కేసన చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

మంగళగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): కుల గణన జరిపించడం ద్వారా సామాజిక న్యాయం గెలిచినట్టయిందని, ధర్మ యుద్ధంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజయం సాధించారని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ చెప్పారు. ఈసారి జరిగే జనగణన తోపాటు సమగ్ర కులగణన కూడా జరపాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయించడాన్ని స్వాగతిస్తూ గురువారం మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేసన శంకరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వుడతా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తిరువీధుల కిరణ్, నేతలు ఆలా శివాజీ, జంజనం వరప్రసాద్, జీ జయలక్ష్మి దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా మే డే వేడుకలు



మంగళగిరిలో టీఎన్‌టీయూసీ పతాకాన్ని ఆవిష్కరించిన పోతినేని శ్రీనివాసరావు, యూనియన్ నేతలు

మంగళగిరి సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో అరుణ పతాకం రెపరెపలాడింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణం, మండలంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంతోపాటు ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 17 శాఖల్లో నేతలు అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నేతలు చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, గండికోట దుర్గారావు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో 27 కేంద్రాల్లో మే డే జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, నేతలు ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ, కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా కొత్త బస్టాండు, ఎయిమ్స్ ప్రవేశ మార్గం వద్ద యూనియన్ పతాకాలను నేతలు ఆవిష్కరించారు. కార్మిక వర్గాలకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పాలనలో కార్మిక లోకానికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. మేడే స్ఫూర్తితో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు.

● **తాడేపల్లి/తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఆయా పార్టీల ప్రజా సంఘాల నేతలు ఘనంగా నిర్వహించారు. కుంచనపల్లిలో జరిగిన మే డే వేడుకల్లో సీఐటీయూ జిల్లా నేత వై నేతాజీ ప్రసంగించారు. సీఐటియూ, ఏఐటియూసీ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో పతాకావిష్కరణలు చేసి ర్యాలీ నిర్వహించారు. నేతలు కార్యకర్తలు మేడే వేడుకల్లో పాల్గొన్నారు. నులకపేటలోని ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో మేడే వేడుకలు నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో వేడుకల్లో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దుగ్గిరాల, తుమ్మపూడి, చిలువూరు, రేవేంద్రపాడు తదితర గ్రామాల్లో ప్రపంచ కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ఈమని అప్పారావు, జెట్టి బాలరాజు, గొర్రిపాటి శ్రీనివాసరావు, నడకుదురు యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● **వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి) :** మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడదామని సీఐటీయూ జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుజాత, వెంకాయమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● **ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి):** ప్రత్తిపాడు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ పతాక ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, ఆదినారాయణ, రమేష్, ప్రసాద్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం మే డే వేడుకలు నిర్వహించారు. పలు చోట్ల జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, పలు కార్మిక సంఘ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు, కాపు వెంకటసుబ్బారావు, ముద్దన వెంకటేశ్వర్లు, ఆకుల వెంకటేష్, ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

● **తుళ్లూరు (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ కార్మిక దినోత్సవం వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వెంకటపాలెం, రాయపూడి, గ్రామాల్లో పార్టీ పతాకాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బెజవాడ యాకోబు, ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు షేక్ నాగుల్ మీరావలి, కోటయ్య, బాలయేసు, బాబురావు, మహిళా సమాఖ్య నాయకులు తోకల అనురాధ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

● మేడికొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మండంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలు నిర్వహించారు. పేరేచర్లలోని నికో ఆగ్రో కెమికల్స్ సంస్థ కార్మికులతో పాటు పంచాయతీ కార్మికులు పేరేచర్ల జంక్షన్‌లో ఐక్యంగా మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు మహమ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు. మేడికొండూరు, సిరిపురంలలో మేడే జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో జిల్లానాయకులు బైరగాని శ్రీనివాసరావు, ఎస్ఎం భాషా, భవన నిర్మాణకార్మికులు, పంచాయతీ కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్సు పాల్గొన్నారు.

రాజధాని పునర్నిర్మాణ సభకు తరలిరావాలి

● వరగానిలో కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం

పెదనందిపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ వేడుకకు తరలిరావాలని కోరుతూ మండల పరిధిలోని వరగానిలో గురువారం కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుంచి గ్రామ ప్రధాన కూడళ్లలో బస్సులు అందుబాటులో ఉంటాయని, పెద్ద ఎత్తున మహిళలు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, టీడీపీ సీనియర్ నాయకులు పోపూరి వెంకటప్పయ్య, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు చెన్నుపాటి సురేంద్ర, జనసేన నాయకులు కొల్లా లీలాగోపీ, తదితరులు పాల్గొన్నారు.

● రాజధాని సభకు తరలివచ్చే ప్రజలకు రైతన్న డెయిరీ వారు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ కమ్మ నాగమల్లేశ్వరరావు గురువారం తెలిపారు. దీనిలో భాగంగా కంపెనీలో మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేసి ఏటుకూరు బైపాస్ వద్ద ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారని తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పెదనందిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోని ప్రజాసేవ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట, కమ్యూనిస్టు, స్వాతంత్ర్య పోరాట యోధుడు సుందరయ్య జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంపని రామారావు, మర్రి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

వట్టిచెరుకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలో నూతనంగా పునఃర్నిర్మాణం చేసుకున్న రుక్మిణీ సత్యభామ సమేత గోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈనెల 3వ తేదీన వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ పునఃర్నిర్మాణ కమిటీ, స్థానిక పురోహితులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఎన్టీఆర్ పింఛన్‌తో భరోసా : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



కంతేరులో వృద్ధుడికి పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, వాసిరెడ్డి జయరామయ్య

తాడికొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పింఛన్‌తో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం తాడికొండ మండలం కంతేరు, నిడుముక్కల గ్రామాల్లో ఎన్టీఆర్ పింఛన్‌ను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పంపిణీ చేశారు. కంతేరులో టీడీపీ సీనియర్ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య, నిడుముక్కలలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్‌తో పాటు స్థానిక ఎస్సీ నాయకులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడుచిగురుపాటి అనూప్, వాణిజ్య విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు జెట్టి మోహన్‌రావు, బందెల కుమార్‌రాజు, జెట్టి భాస్కరరావు, మాదాసు మాణిక్యరావు, ఎంపీడీవో సమతా వాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

దుగ్గిరాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటైన కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం. ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం మూడురోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్ తెలిపారు. శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, తదితర కార్యక్ర మాల అనంతరం భక్తులు స్వయంగా అమ్మవారికి గోక్షీరాబిషేకం చేసుకోవ చ్చునని, 3వ తేదీ ఉదయం 8గంటలకు నిత్యపూజ, వాస్తుపూజ, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహహోమం తదితర కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించనున్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం నిర్వహించే ప్రతిష్ఠ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖరరావు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ ఉన్నతాధికారులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్ర మాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్ కోరారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మంగళగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీగీతా యోగా ఆరోగ్య సేవాకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి యోగ శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని ప్రధాన యోగాచార్యులు పంచుమర్తి సత్యనారాయణ తెలిపారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని మార్కండేయ కల్యాణ మండపంలో 15 రోజులపాటు జరిగే ఈ యోగా శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇస్తామన్నారు. మంగళగిరి ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కొలకలూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

తెనాలి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువల్లో పూడికతీత పనులు కూడా సక్రమంగా చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గురువారం గ్రామంలోని ప్రధాన వీధి నుంచి మసీద్ రోడ్డుకు మురుగు పారేందుకు అవసరమైన కాలువల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వర్షాకాలంలో ఈ వీధిలో నీరునిలిచి చెరువులను తలపిస్తూ ఉంటుంది. ముస్లిం నాయకులు ఎస్‌కే అజీజ్, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అందజేసిన రైల్వే పోలీసులు

తెనాలి, మారీసుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): రైల్లో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను తిరిగి సొంతదారునికి రైల్వే పోలీసులు అందించారు. గురువారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన షేక్ యాకుబ్ బాషా ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. 30వ తేదీన రైలులో పయాణిస్తూ ల్యాప్‌టాప్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ల్యాప్‌ట్యాబ్‌ను ట్రేస్‌చేసి యాకుబ్ బాషాకు అందజేశారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తెనాలి, మారీసుపేట,మే 1 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రామలింగేశ్వరపేట డిపో రోడ్డులో సోదరులైన తరణి శివశంకరప్రసాద్, సాయి కుమార్‌లు కలసి జీవిస్తున్నారు. శివ శంకర ప్రసాద్ (26) ఆటోడ్రైవర్‌గా సాయికుమార్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శివ శంకరప్రసాద్ ఆర్థికంగా దెబ్బతిన్నాడు. ఈ క్రమంలో పనిమీద బయటకు వెళ్లిన సాయికుమార్ తిరిగి ఇంటికి వచ్చి తలుపు తట్టిన తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపు పగలగొట్టి లోపలకువెళ్లి చూడగా ఇంటిలో దూలానికి ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకొని ఉన్నాడు. కిందకు దించి జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ..

తెనాలి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘనటపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం మండలంలోని అంగలకుదురు వాల్మీకి కాలనీకి చెందిన ఎం.కోటేశ్వరరావు (45) రోజువారి కూలి. ఇతడికి వివాహమై భార్య ఇద్దరు పిల్లలున్నారు. గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబంలో కలతలతో బుధవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతిపై భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం మోదీ, కేసన చిత్రపటాలకు క్షీరాభిషేకం

తెనాలి, మారీసుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యకుడు కేశన శంకరరావు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలకు పట్టణ బీసీ సంఘ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఏప్రిల్ 30న కేంద్ర క్యాబినెట్ బీసీల కులగణన చేయాలని నిర్ణయం తీసుకోవటంపై గురువారం స్థానిక వహబ్‌చౌక్‌లో పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యకుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసన శంకరరావు అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితమే బీసీ కులగణన నిర్ణయం అన్నారు. కార్యక్రమంలో కుర్రా శ్రీను, కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, కుర్రా సుజాత, ఎం.జయకృష్ణ, కె.సుబ్రహ్మణ్యం, రాఘవ, వంశీ, మురళీ, రమేష్, షేక్ కాలేషా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట,మే 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. గురువారం స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు వంగర మాధవరావు 56వ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎం.రమణయ్య, వంగర జగదీశ్వరి, సోమరౌతు ఏసుబాబు, ఎం.సాయికృష్ణ, కుర్రా శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారామపురంలోని శ్రీపోలేరమ్మతల్లి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గురువారం 3500 మందికి అన్నదానం చేశారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని మల్లెలతో అలంకరించి విశేష పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా మహిళలు, రైతులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణ, మండల గ్రామాల్లో మేడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చెంచుపేట విద్యుత్ కార్యాలయంలో తెనాలి - మంగళగిరి రోడ్డులోని ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కార్మికులు అనేక విధాలుగా ఇబ్బందులు పడ్డాడరన్నారు. ఇసుక కొరతను సృష్టించటంతో ట్రాన్స్‌పోర్టు కార్మికులు, భవన నిర్మాణ రంగంతోపాటు అనుబంధ రంగ కార్మికులు సైతం పస్తులుండి కుటుంబాన్ని పోషించలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన ఉతందాలను ఎన్నటికి మరువలేమన్నారు. కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, మహమ్మద్‌ఖుద్దుస్, పలువురు కూటమి నాయకులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలిరూరల్: గత వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి మొండిచెయ్యి చూపితే కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అండగా నిలుస్తుందని తెలుగునాడు ఆటోయూనియన్ గౌరవాధ్యక్షులు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి చెప్పారు. గురువారం తెనాలి ఆటోయూనియన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వీరవల్లి మురళి, కనగాల నాగభూణంలు పాల్గొని కార్మికులతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఐదేళ్లలో అధ్వానంగా ఉన్న రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఆటో కార్మికులు గుంతలరోడ్లలో వాహనాలు దెబ్బతిని ఇబ్బందులు పడ్డారన్నారు. ఆటో యూనియన్ నాయకుడు కారుమంచి సురేష్ మాట్లాడుతూ కార్మికులకు ఏ కష్టం వచ్చిన వెంటనే నేనున్నానని స్పందించే మంచి నాయకులు వీరవల్లి మురళి, కనగాల నాగభూషణంలన్నారు. తొలుత మేడే జెండాను మురళి, నాగభూషణంలు ఎగురవేసి కార్మికుల ఐకమత్యంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ కిషోర్ రాజు, వేములపల్లి శ్రీనివాసరావుచ సురేష్, శ్రీను, వెంకట్రావు, నరసింహారావు, గణేష్ యూత్ సభ్యులు గుమ్మడి రవీందర, ముప్పవరపు సాంబశివరావు పెద్దఎత్తున ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి కేక్‌కట్‌చేస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు



మేడే వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు



కొల్లిపరలో మేడే వేడుకల్లో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

కార్మికులకు సీఐటీయూ అండ: బాబుప్రసాద్

తెనాలి అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల రక్షణ కోసం సీఐటీయూ అండగా నిలబడుతుందని జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ చెప్పారు. మేడేను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎర్ర జెండాలు ఎగురవేశారు. కార్మికులకు 8గంటల పని ఉండేలా ప్రభుత్వాలు పర్యవేక్షించాలని, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కార్మికుల కోసం పోరాటాలు చేస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా సీఐటీయూ పని చేస్తుందన్నారు. కార్మికులకు సంబంధించి నిధులను ప్రభుత్వం వాడుకుంటోందని, పథకాల కోసం పెట్టిన దరఖాస్తులు లక్షల్లో పెండింగ్‌లో ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. షేక్ హుస్సేన్‌వలి, వినయ్‌కుమార్, సుభాని, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, చంద్రకళ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. రైల్వే స్టేషన్, ఆటోస్టాండ్, పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, సెంట్రింగ్, డాల్‌మిల్, యార్డు హమాలీ, బెవరేజెస్, తాపీ వర్కర్ల సంఘం తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెంచుపేటలో నిర్వహించిన మేడే వేడుకల్లో సీపీఐ నాయకులు వెంకటేశ్వరరావు, సింగారావు, కృష్ణ తదితరులు ఎర్రజెండా ఎగురవేసి సందేశం ఇచ్చారు. కొత్తపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారక శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మేడే వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లో సీఐటీయూ, సీపీఎం నాయకులు పతాకాలను ఆవిష్కరించారు. మండల కేంద్రం కొల్లిపరలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు కార్మిక వర్గం ప్రభుత్వాల మీద, యజమానుల మీద పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్మికులందరూ తమ హక్కుల సాధన కొరకు సమైక్యంగా ఉండాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ మాట్లాడుతూ సుందరయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని కార్మికులకు అండగా నిలబడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు షేక్ జానీ బాషా, మల్లోల రమేష్, బత్తుల సుబ్బారావు, మల్లోల వీరకుమారి, డి. మల్లేశ్వరి, తిరుపతమ్మ, వనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడతామని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి, ఏఐటీయూసీ కార్మిక అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కూరగాయల మార్కెట్, తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన సందర్భంగా 138 యేళ్ల క్రితం కార్మిక హక్కుల కోసం ఉద్యమించిన అనేక మంది కార్మికులు అమెరికా సైన్యం చేతిలో మరణించారన్నారు. కార్మిక వీరుల బలిదానాల నుంచి ఎర్రజెండా ఉద్భవించి, కార్మికుల హక్కులు ఏర్పడ్డాయన్నారు. ఈ హక్కుల సాధన కోసం పోరాడిన అమరవీరుల స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడతామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక రాజారావు హాస్పిటల్ రోడ్డు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధిలోని మాచవరం గ్రామంలో సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, సీపీఎం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పొన్నూరు పట్టణంలోని రేపల్లె బస్టాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఆటో వర్కర్లు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించి కేక్ కోసి పంచిపెట్టారు.



జెండా ఎగురవేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్



పొన్నూరులో ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మేడే సందర్భంగా పొన్నూరులో కేక్‌కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

● న్యాయమూర్తి వివేకవర్ధన్

తెనాలి అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 1వ అదనపు సివిల్ జడ్జి వివేక్‌వర్ధన్ పేర్కొన్నారు. కార్మిక దినోత్సవం పురస్కరించుకుని కొత్తపేట తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికుల పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సదస్సులో మాట్లాడుతూ, అసంఘటిత రంగంలో భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి చట్టం ప్రకారం సామాజిక భద్రత, సంక్షేమం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ఇందు కోసం వృద్ధాప్యం, విద్య, ఉపాధి, గృహ నిర్మాణం, జీవనం, వైకల్యం వంటి పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని పలు పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. జాతీయ సామాజిక భద్రత బోర్డులు ఏర్పాటు చేశారని, కార్మికులంతా గుర్తింపుకార్డులు పొంది సంక్షేమ పథకాలను పొందాలన్నారు. న్యాయవ్యవస్థ కూడా తగిన రక్షణ కల్పిస్తుందని, కార్మికుల హక్కులకు భంగం వాటిల్లితే న్యాయ స్థానాలను ఆశ్రయించి రక్షణ పొందాలన్నారు. లేబర్ కమిషనర్ డీవీ శివప్రసాద్, వినయ్‌కుమార్, సుభాని, రాజు, నాగరాజు, అనీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వివేకవర్ధన్

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, మే, 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీసాహెబ్ అన్నారు. మండల న్యాయసేవా కేంద్రం, మెజిస్ట్రేట్ ఏ పవన్‌కుమార్ ఆదేశాల ప్రకారం గురువారం మేడే వేడుకల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు కార్మిక చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ జిలానీ, రమేష్‌బాబు, షేక్ ముజీర్, మహ్మద్‌బేగ్, మగ్బుల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

హత్య కేసులో నిందితుల అరెస్టు

● యేలగుంట చెరువు వద్ద జరిగిన యువకుడి హత్యపై వీడిన మిస్టరీ
● వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య
● నిందితుల్లో మృతుడి భార్య, ప్రియుడు
● హత్యలో బాలుడి హస్తం

తెనాలి, మారీసుపేట,మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను ప్రియుడి మోజులో హత్య చేయించిన సంఘటన పోలీసుల విచారణలో వెలుగు చూసింది. నాలుగు రోజుల క్రితం తెనాలి మల్లిపాడులోని యేలగుంట చెరువువద్ద యువకుడి హత్య సంచలనం రేకెత్తించింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులకు విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. గురువారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసులో నిందుతుల వివరాలను సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. స్థానిక నాజరుపేటకు చెందిన గండికోట వెంకటపణి పృధ్వీరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం బంధువైన వినుకొండకు చెందిన వెంకటలక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో తెనాలి జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహ సముదాయంలోలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. ఆరు నెలల క్రితం ఆటో బాడుగలు తక్కువగా ఉంటున్నాయని బెంగుళూరులో పనికి భార్యను వెంట తీసుకొని వెళ్లాడు. అక్కడ వెంకటలక్ష్మికి పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లికి చెందిన గోవిందు కోటేశ్వరావుతో పరిచయం ఏర్పడింది. అదికాస్త వారి మధ్య వివాహేతేర సంబంధానికి దారి తీసింది. భార్య ప్రవర్తను అనుమానించిన పృధ్వీరాజు ఆమెను వదిలి తెనాలి వచ్చాడు. రెండు నెలలు తరువాత తిరిగి తన భర్త వద్దకు వచ్చింది. అనుమానం రాకుండా ఉండేందుకు ప్రియుడు కోటేశ్వరావును అన్నయ్య అని పిలిచేది. ఈ క్రమంలో అప్పుడప్పుడు తెనాలి వచ్చే కోటేశ్వరావు పృధ్వీరాజుతో కలసి మద్యం సేవించేవాడు. ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని నిశ్చయించుకున్న వెంకటలక్ష్మి కోటేశ్వరావులు హత్యా పథకాన్ని రచించారు. ఏప్రిల్ 27న తెనాలి వచ్చిన కోటేశ్వరావు, అతని అన్న కుమారుడు గుంటూరుకు చెందిన గోవిందు ఉదయకిరణ్ అతని స్నేహితుడు బాలుడితో కలసి తెనాలి వచ్చారు. మద్యం సేవిద్దాం రమ్మని పృధ్వీరాజును నమ్మకంగా తీసుకొని వెళ్లి కత్తి, ఇటుకరాయితో ఉదయ కిరణ్, కోటేశ్వరావులు దాడిచేసి హత్యచేసి మృతుని ఆటో తీసుకొని పారిపోయారు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు మృతుని తండ్రి వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.



నిందితుల వివరాలను తెలియజేస్తున్న సీఐ రమేష్‌బాబు తదితరులు

ఏఎన్‌యూలో విద్యార్థిని ఢీకొట్టిన కారు

● ఉన్నత విద్యా మండలి చైర్మన్ కారు డ్రైవర్ నిర్లక్ష్యం
● గాయపడిన విద్యార్థి ఎన్నారై హాస్పిటల్‌కు తరలింపు

పెదకాకాని, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రధాన గేటు వద్ద ఓ పీజీ విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గురువారం వర్సిటీలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేష్ అనే వ్యక్తి అడ్డగోలుగా కారు నడపటంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. జంగారెడ్డిగూడెం చెందిన టి.మహేష్ అనే విద్యార్థి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీజీ ఆర్థికశాస్త్రం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విశ్వవిద్యాలయంలోని అశోక బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఏ మధుమూర్తి మూడు నెలలుగా వర్సిటీ అతిథి గృహంలో ఉంటున్నారు. ఆయనను అతిథి గృహంలో దించేందుకు డ్రైవర్ రాజేష్ కారును అతి వేగంగా నడుపుతూ ప్రధాన గేటు వద్ద ఉన్న విద్యార్థిని ఢీ కొట్టాడు. దీనిపై ప్రశ్నించిన విద్యార్థులను, ఉద్యోగులను దుర్భాషలాడాడు. కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన పీజీ విద్యార్థి మహేష్‌ను వైద్య చికిత్స నిమిత్తం తోటి విద్యార్థులు,స్నేహితులు మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు తరలించారు.

అధ్వానంగా సీడీపీవో కార్యాలయం

● పగిలిన మెట్ల టైల్స్, కిటికీ అద్దాలు

తెనాలి, మారీసుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాలకు ప్రధానంగా ఉన్న తెనాలి సీడీపీవో కార్యాలయం అధ్వానంగా మారింది. ఈ కార్యాలయంలో మూడు మండలాలలోని అంగన్‌వాడీ కేంద్రాల సేవలను పర్యవేక్షించాల్సి ఉంది. అంతటి ముఖ్య కార్యాలయం నిర్వహణ లోపంతో అపరిశుభ్ర వాతావరణంలో కనిపిస్తోంది. కార్యాలయానికి లోపలికి వెళ్లే మెట్లు టైల్స్ కార్యాలయం కిటికీ అద్దాలు పగిలిపోయాయి. బాత్‌రూమ్ డోర్లు కూడా సరిలేకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల ఆరోగ్య, పోషకాహారం, పరిశుభ్రతలపై అవగాహన కల్పిస్తూ వాటిని అమలయ్యేలా చూసే అధికారిక కార్యాయంలో దుస్థితిలో ఉండటంతో కార్యాలయానికి వచ్చే పలువురు మహిళలు విస్తుపోతున్నారు. ఈ కార్యాలయానికి నిత్యం మూడు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది వచ్చిపోతుంటారు. వారందరు వేచి ఉండేందుకు కుర్చీలు, పైన ఫ్యాన్యులు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారు ఏర్పాటుచేసే పలు అవగాహన సదస్సులు సైతం ఈ కార్యాలయంలోనే నిర్వహించాల్సి ఉండగా అధికారులు సౌకర్యాలపై దృష్టి పెట్టకపోవడంతో కార్యాలయానికి మూడు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై ఉన్నతాధికారులకు తెలిపేందుకు వచ్చే ప్రజలు ఉన్నతాధికారుల కోసం అక్కడ వేచిఉండే పరిస్థితి లేకపోవటంతో అటువైపు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు. అధికారులు స్పందించి పరిసరాల పరిశుభ్రతలను పాటిస్తూ, కార్యాలయానికి వచ్చేవారికోసం కనీసం కుర్చీలు, ఫ్యానులు, తాగునీటిని ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు. సీడీపీవోను ఎం.సునీత దీనిపై వివరణ కోరగా.. కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం ప్రణాళికలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపామని త్వరలోనే పనులు ప్రారంభిస్తారని, సౌకర్యాలు మెరుగుపరుస్తామన్నారు.



పగిలిపోయిన మెట్ల టైల్స్

భక్త బృంద సేవలు అభినందనీయం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, మారీసుపేట మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సభ్యులు పేదల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వంతెన వద్ద శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మేడేని పురస్కరించుకొని పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. ముందుగా ఆటో యూనియన్ వర్కర్స్ సంఘ సభ్యులు ఏర్పాటే చేసిన మేడే జెండాను ఆవిష్కరించి మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ, జానీ, ప్రవీణ్, గిరిష్, సాయి, పాపయ్యచౌదరి, పోతురాజు, చంటి పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, పక్కన శ్రీను, శివరామకృష్ణ తదితరులు